క్లుప్తంగా

శాస్త్రోక్తంగా మండప దేవతా పూజలు



నాగాయలంక: స్థానిక పార్వతీ సమేత కన్యకా పరమేశ్వరీ సమన్విత నగరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం 12 మంది దంపతులతో యాగశాలలో మండప దేవతా పూజలు, హోమాలు నిర్వహించారు. పీటలపై కూర్చున్న వారు, భక్తులు స్వయంగా అభిషేకాలు చేశారు. ప్రత్యేక వాహనంపై దాసాంజనేయ విగ్రహం, కలశాలను అలంకరించి వాసవీ యూత్ ఆధ్వర్యంలో గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రతిష్ఠోత్సవాల్లో విజయానందగిరి స్వామీజీ

భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలో జరుగుతున్న అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ఠోత్సవ కార్యక్రమాలను మంగళవారం పెదకళ్లేపల్లి ఓంకార పీఠాధిపతి విజయానందగిరి స్వామీజీ సందర్శించి భక్తులకు ఆశీస్సులు అందించారు. బ్రహ్మశ్రీ దుర్గా హరిబాబు స్వామి (తెనాలి) బృందం పర్యవేక్షణలో శాస్త్రోక్తంగా సాగుతున్న పూజల్లో ఆయన పాల్గొన్నారు. దీక్షా దంపతులతో మండప దేవతా పూజలు, హోమాలు, విగ్రహాలకు పంచ ద్రవ్యాభిషేకం జరిగాయి. అనంతరం ప్రతిష్ఠా విగ్రహాలకు గ్రామోత్సవం జరిగింది. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులచే ప్రధాన హోమం పూజలు జరిగాయి. గ్రామ ప్రముఖులు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

అగ్ని బాధితుడికి సాయం



గూడూరు: రామానుజవత్తర్లపల్లిలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన చోరగుడి పెద్ద ఏసోబు కుటుంబానికి మంత్రి జోగి రమేష్ చొరవతో ప్రభుత్వం గృహ నిర్మాణ రుణం మంజూరు చేసిందని వైఎస్సార్ సీపీ నాయకులు గౌరిపర్తి రవికుమార్, తలుపుల వెంకట కృష్ణారావు, రాజుపాటి జమదగ్ని తెలిపారు. నిర్వాసిత కుటుంబానికి రూ.5 వేల ఆర్థిక సహాయాన్ని మంగళవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. నాయకులు మాగంటి నాగరాజు, వేమూరి స్వామి తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

మచిలీపట్నంటౌన్: 28వ డివిజన్‌కు చెందిన సయ్యద్‌గౌస్ ఇటీవల మృతిచెందాడు. వైఎస్సార్ బీమా పథకం ద్వారా మంజూరైన రూ. 10 వేలను మృతుడి భార్య జరీనాకు మంగళవారం వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌చార్జి షేక్ మొహమ్మద్ సాహెబ్ అందజేశారు. మిగిలిన రూ. 90 వేలు త్వరలోనే వారి బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని చెప్పారు.

భూసార పరీక్షల మేరకు ఎరువుల వినియోగం

బంటుమిల్లి: భూసార పరీక్షల మేరకు రైతులు కాంప్లెక్స్ ఎరువులను వినియోగించాలని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) డీడీఏ జ్యోతిరమణి అన్నారు. కంచడం గ్రామంలో మంగళవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఒక్క రోజు శిక్షణ తరగతి నిర్వహించారు. డీడీఏ మాట్లాడుతూ రానున్న సార్వా సాగులో రైతులు మట్టి నమూనా పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. పరీక్షలకు మట్టిని పొలం నుండి ఎలా సేకరించాలో ఆమె అవగాహన కల్పించారు. తీర ప్రాంత భూముల్లో యూరియా వాడకం తగ్గించాలని చెప్పారు. మచిలీపట్నం కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) శాస్త్రవేత్త గిరిజారాణి మాట్లాడుతూ ఖరీఫ్ సాగుకు అనుకూలమైన వరి వంగడాలను మచిలీపట్నం పరిశోధన కేంద్రంలో రూపొందించామన్నారు. ఇందులో ఎంసీఎం 100 రకం విత్తనం అందుబాటులో ఉందని చెప్పారు. రైతుల సందేహాలను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు నివృత్తి చేశారు. సర్పంచ్ బి. చంద్రశేఖర్, ఎంపీటీసీ పి. భగవాన్, మచిలీపట్నం ఏడీఏ శ్రీనివాస్, ఏఓలు పద్మజ, శివరామకృష్ణ, వీఏఏ, రైతులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయండి

- మంత్రి జోగి రమేష్
- స్థానిక సమస్యలకు సత్వర పరిష్కారం
- అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి జోగి రమేష్

పెడన: క్షేత్రస్థాయిలోని ప్రజాప్రతినిధులు స్థానిక సమస్యలను ఏమైనా మీ దృష్టికి తీసుకువస్తే వాటిని మీ స్థాయిలో పరిష్కరించగలిగేవి అయితే తక్షణం పరిష్కరించాలని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. బంటుమిల్లి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులతో వివిధ అంశాలపై సమీక్షా సమావేశం పెడన వ్యవసాయ మార్కెట్ కమిటీ హాల్‌లో మంగళవారం ఆయన నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ ముఖ్యంగా తాగునీటి ఎద్దడి లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని గ్రామీణ నీటి పారుదల శాఖాధికారులను ఆదేశించారు. తాగునీటి చెరువులను నీటితో నింపాలని, తాగునీరు పైపులైన్ల ద్వారా వెళ్లని ప్రాంతాలకు ట్యాంకర్లను ఏర్పాటు చేసి పంపించాలన్నారు. ప్రణాళిక ప్రకారం ఏయే ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని పంపించాలనే దానిపై స్పష్టత ఉండాలని చెప్పారు. కొన్ని చోట్ల ఫిల్టర్‌బెడ్లు పనిచేయడం లేదని పలువురు నాయకులు మంత్రి దృష్టికి తీసుకురావడంతో ఎక్కడెక్కడ పనిచేయడం లేదో వాటి వివరాలను, మరమ్మతులకు ఎంత ఖర్చు అవుతుందనే అంచనాలను తయారుచేసి ఇవ్వాలని అధికారులకు స్పష్టం చేశారు. త్వరితగతిన ఫిల్టర్‌బెడ్‌లకు మరమ్మతులు చేయించి తాగునీరు అందించాలన్నారు. అవి పని చేయని పక్షంలో ఆయా ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేయాలని పేర్కొన్నారు. శివారు ప్రాంతాలు తాగునీటికి ఇక్కట్లు పడకూడదని, ఇబ్బందులుంటే తక్షణం పరిష్కరించాలన్నారు. ఎక్కడైనా తాగునీరు అందడం లేదని ఫిర్యాదులు వస్తే సహించేది లేదని, శాఖాపరమైన చర్యలకు సిఫార్సు చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. విద్యుత్ కోతలు లేకుండా గృహాలకు పూర్తి స్థాయిలో విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉండటం వల్ల కొన్ని చోట్ల లో ఓల్టేజ్ సమస్య ఉత్పన్నమవుతోందని పలువురు మంత్రి దృష్టికి తీసుకురాగా వినియోగదారులు కూడా ఈ వేసవిలో విద్యుత్ వినియోగం వృథా చేయకుండా జాగ్రత్తలు తీసుకుంటే మనకు పూర్తి విద్యుత్ సరఫరా అవుతుందన్నారు. విద్యుత్ వినియోగంలో వినియోగదారులు పొదుపు పాటించాలని సూచించారు. కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు శిథిలావస్థకు చేరాయని, వాటి స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేసి నాణ్యమైన విద్యుత్‌ను అందించాలని విద్యుత్ శాఖాధికారులను మంత్రి ఆదేశించారు. జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పాఠశాలల్లో నాడు–నేడు పనులు పాఠశాలలు తెరిచే నాటికి పూర్తి చేయాలని సంబంధిత శాఖాధికారులకు సూచించారు. సమావేశంలో బంటుమిల్లి ఎంపీపీ వెలివెల చినబాబు, జెడ్పీటీసీ మలిశెట్టి వెంకటరమణ, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రాజబాబు, తిరుమాని శ్రీనివాసరావు, బాబూరావు, ఓడిమి చిన్నారిబాబు, కొల్లా లలితాశేఖర్, సుజ్ఞానం మహేష్, తహసీల్దార్ ఎంవీ సత్యనారాయణ, ఎంపీడీఓ స్వర్ణభారతి, హౌసింగ్ డీఈ శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ కుటుంబాలకు బాసట

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- మృతుల కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



చింతలమడ మృతుల కుటుంబాలకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి, ఆర్డీఓ కిశోర్

అవనిగడ్డ: చింతలమడ రోడ్డు ప్రమాద మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు రాష్ట్ర ప్రభుత్వం పరిహారం అందించింది. గత ఏడాది మే 26వ తేదీన చల్లపల్లి శివారు కాసానగర్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో చింతలమడకు చెందిన ఐదుగురు మృతి చెందగా, మరో 17 మంది గాయపడ్డారు. మృతులు, బాధితులంతా ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన నిరుపేదలు కావడంతో స్థానిక ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు చొరవ తీసుకుని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి పరిహారం మంజూరు చేయించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయం వద్ద మంగళవారం జరిగిన కార్యక్రమంలో ఐదుగురు మృతుల కుటుంబాలు, 17 మంది క్షతగాత్రులకు రూ.23.50 లక్షల సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, ఆర్డీఓ ఐ. కిశోర్ అందజేశారు.

బుద్ధప్రసాద్ బురద రాజకీయాలు చేస్తున్నారు...

ఈ సందర్భంగా ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మాట్లాడుతూ చింతలమడ రోడ్డు ప్రమాద మృతులు, క్షతగాత్రుల పరిస్థితిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించగా పెద్ద మనస్సుతో సహాయం అందించినందుకు గ్రామస్తుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. చల్లపల్లి మండలం మాజేరులో 2018లో కలుషిత తాగునీటి వల్ల 18 మంది చనిపోయినా ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి పరిహారం ఇవ్వలేదన్నారు. అప్పట్లో ప్రతిపక్షనేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామంలో పర్యటించడంతో పాటు మచిలీపట్నంలో ధర్నా చేసినా పరిహారం అందించేందుకు ప్రభుత్వం స్పందించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఒక్కో కుటుంబానికి రూ.50 వేల చొప్పున తన సొంత డబ్బులు అందించామన్నారు. చింతలమడ రోడ్డు ప్రమాద మృతుల పరిహారంపై బురద రాజకీయాలు చేసిన బుద్ధప్రసాద్ ఆనాడు ఎమ్మెల్యేగా ఉన్నారని, అప్పుడెందుకు పరిహారం ఇప్పించలేదని ప్రశ్నించారు. బోడగుంటలో ఎస్సీలకు చెందిన 25 గృహాలు కాలిపోయి బాధితులు రోడ్డున పడితే ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న బుద్ధప్రసాద్ రూపాయి పరిహారం ఇప్పించలేక పోయారన్నారు. సీటును నిలబెట్టుకునేందుకు బుద్ధప్రసాద్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని సింహాద్రి విమర్శించారు. కార్యక్రమంలో ఏపీ రైతు విభాగం జోనల్ ఇన్‌చార్జి కడవకొల్లు నరసింహారావు, చల్లపల్లి తహసీల్దార్ గోపాలకృష్ణ, అవనిగడ్డ ఎంపీపీ తుంగల సుమతీదేవి, జెడ్పీటీసీ చింతలపూడి లక్ష్మీనారాయణ, లక్ష్మీపురం, పురిటిగడ్డ, అవనిగడ్డ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



పెద్ద మనసుతో సాయం

రోడ్డు ప్రమాదంలో భార్య వెంకటరమణ మృతిచెందింది. ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడి పరిహారం అందించి పెద్ద మనసుతో ఆదుకున్నారు.

– భూరేపల్లి పెద్ద శివాజీ, మృతురాలి భర్త, చింతలమడ



సీఎం జగన్ ఆదుకున్నారు

గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో నా భర్త మాధవరావు చనిపోయారు. ఆయనే కుటుంబానికి ఆధారం. పెద్ద దిక్కు కోల్పోయిన నాకు సీఎం జగన్ సహాయం అందించి ఆదుకున్నారు.

– మద్దాల బాలమ్మ, మృతుడి భార్య

జగన్ పాలనలో బందరుకు పూర్వ వైభవం

మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ



శ్మశానవాటికలో లైటింగ్ అంశంపై టీడీపీ సభ్యుల అభ్యంతరం సందర్భంగా జరిగిన చర్చ (ఇన్‌సెట్) మాట్లాడుతున్న మేయర్ వెంకటేశ్వరమ్మ

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో మచిలీపట్నానికి పూర్వ వైభవం వస్తోందని మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అన్నారు. నగర పాలక సంస్థ కౌన్సిల్ అత్యవసర సమావేశం మంగళవారం నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ అధ్యక్షతన జరిగింది. కౌన్సిల్ సమావేశం ప్రారంభిస్తూ ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాలు మచిలీపట్నం ప్రాంతాన్ని పట్టించుకోలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత ఫిషింగ్ హార్బర్, మెడికల్ కళాశాల పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ నెల 22వ తేదీన పోర్టు నిర్మాణ పనులకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని) ప్రత్యేక కృషితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ ప్రాంత ప్రజల మనోభావాలను గుర్తించి అభివృద్ధి చేస్తున్నారని వివరించారు.

ముస్లిం శ్మశాన వాటికకు లైటింగ్ అంశాన్ని అడ్డుకున్న టీడీపీ

ముస్లిం శ్మశానవాటికకు లైటింగ్ ఏర్పాటు చేసేందుకు రూ. 4.96 లక్షలు ఎలా కేటాయిస్తారు.. ప్రధాన రహదారుల్లో అక్కడక్కడా లైట్లు వెలగక ప్రమాదాలు జరుగుతున్నాయి.. వీటిని పట్టించుకోకుండా శ్మశానాల్లో లైటింగ్ ఎందుకు అంటూ 27వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ చిత్తజల్లు నాగరాము ప్రశ్నించారు.

33వ డివిజన్‌లోని ఇమాం ఇ జమానా పంజా ప్రాంతంలో ఉన్న శ్మశాన వాటికలో లైటింగ్ ఏర్పాటు పనులు చేపట్టేందుకు ఆమోదం కోరుతూ అజెండాలో 5వ అంశంగా ఉంచారు. ఈ అంశాన్ని మీటింగ్ గుమాస్తా కల్యాణ్ చదువుతుండగానే రాము అడ్డు తగిలారు. ముస్లిం శ్మశాన వాటికలో రాత్రి పూట ఏం చేస్తారని లైటింగ్ పెడుతున్నారని ప్రశ్నించారు. దీనికి స్పందించిన వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ మేకల సుబ్బన్న, డెప్యూటీ మేయర్ లంకా సూరిబాబు, ఇతర కార్పొరేటర్లు ముస్లింల సంప్రదాయాలు తెలియకుండా ఎలా మాట్లాడతావంటూ ప్రశ్నించారు. రంజాన్‌తో పాటు పలు పండుగల సమయంలో ముస్లింలు రాత్రి వేళల్లో శ్మశానాలకు వెళతారని, ఈ విషయం కూడా తెలియకుండా మాట్లాడటం సరికాదన్నారు. ఈ సందర్భంగా టీడీపీ, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఒకటో అంశంగా ఉన్న 46వ డివిజన్‌లో యర్రా నాగేశ్వరరావు మునిసిపల్ పార్కు అభివృద్ధికి సంబంధించిన అంశంపై టీడీపీ సభ్యులు అధికార పక్ష సభ్యులతో వాగ్వాదానికి దిగారు. సమావేశంలో కమిషనర్ జి. చంద్రయ్య, అసిస్టెంట్ కమిషనర్ కె. చంద్రిక, మునిసిపల్ ఇంజినీర్ శ్రీకాంత్, ఏసీపీ మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

కుయుక్తులతో ప్రజలను తప్పుదారి పట్టించలేరు

- ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు
- పర్రచివరలో గడప గడపకు మన ప్రభుత్వం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి

పర్రచివర(నాగాయలంక): నియోజకవర్గంలో అభివృద్ధిపై చర్చకు తాను చేసిన సవాలును స్వీకరించకుండా కుయుక్తులతో ప్రజలను పక్కదారి పట్టించేందుకు మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. బుద్ధప్రసాద్ రైతు ఉద్యమాల పేరుతో లేనిపోని హడావుడి చేస్తున్నా ప్రయోజనం శూన్యమని, ప్రజలు ఏమాత్రం పట్టించుకోరని చెప్పారు. పర్రచివర సచివాలయ పరిధిలోని దీనదయాళపురం, పుల్లయ్యగారిదిబ్బ గ్రామాల్లో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయన 275 గృహాలకు తిరిగి ప్రభుత్వం ద్వారా పొందిన సంక్షేమం లబ్ధిని చదివి వినిపించి బ్రోచర్లను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. పాలనా వ్యవస్థను గ్రామస్తులకు చేరువ చేసి అర్హులైన ప్రతి ఒక్కరికి లబ్ధి చేకూరేలా అధికార వ్యవస్థ పనిచేస్తుంటే ప్రతిపక్షాల నేతలు అవాకులు చవాకులు మాట్లాడటం సిగ్గుచేటన్నారు. గ్రామాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పెరుగుతున్న ప్రజాదరణను ఎవరూ ఆపలేరని చెప్పారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ భోగాది శేషగిరిరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పరిశె యేసయ్య, నియోజకవర్గ సచివాలయాల కన్వీనర్ మద్ది వెంకట నారాయణ (చిన్నారి), పీఏసీఎస్ అధ్యక్షుడు తోట సాయిబాబు, ఆర్‌ఐ ఎన్.నందు, వెలుగు ఏపీఎం కేవై దాసు, ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం, వీఆర్వో కె.వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, కార్యదర్శులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై పర్యవేక్షణ

కలెక్టర్ పి. రాజాబాబు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాజాబాబు

చిలకలపూడి(మచిలీపట్నం): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై మండల ప్రత్యేకాధికారులు పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ పి. రాజాబాబు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండలాధికారులతో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండల ప్రత్యేకాధికారులు, జిల్లా అధికారులు వారంలో ఒకటి, రెండు గ్రామాల్లో పర్యటించాలన్నారు. ముఖ్యంగా స్పందనలో తిరస్కరించిన అర్జీలు రీ–ఓపెన్ అవుతున్నాయని, ఇందుకోసం సంబంధిత సచివాలయాన్ని సందర్శించి కారణాలను విశ్లేషించాలన్నారు. సచివాలయాల ద్వారా అందుతున్న సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. ప్రభుత్వ పథకాలపై క్షేత్రస్థాయి పరిశీలన సమయంలో రికార్డుల నిర్వహణ, వాస్తవ పరిస్థితులను గమనించాలన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులపై కూడా విచారణ చేయాలని చెప్పారు. పాఠశాలలు ప్రారంభమైన తరువాత బడిబయట ఉన్న పిల్లలపై సచివాలయ సంక్షేమ కార్యదర్శులు, సీఆర్పీలు, వైద్య, ఆరోగ్య సిబ్బంది సంయుక్తంగా సర్వే చేయించి నివేదిక ఇవ్వాలని విద్యా శాఖాధికారులను ఆదేశించారు. జగనన్న లే అవుట్‌కు సంబంధించి ఇప్పటి వరకు 15 వేల గృహాలకు పైగా నిర్మాణం పూర్తి చేసుకున్నామని, మరో 30 వేల గృహాలు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 699 జగనన్న లే అవుట్లలో 287 లే అవుట్లకు మౌలిక వసతుల కల్పన పూర్తయ్యిందన్నారు. మిగిలిన లే అవుట్లలో విద్యుద్దీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా నీటి సరఫరా చేయాలని, ఇళ్ల నిర్మాణాలకు నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసే కన్నా తాత్కాలిక పైప్‌లైన్లు ఏర్పాటు చేసి నీటి వసతిని కల్పించాలని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌ఓ ఎం. వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ జీవీ సూర్యనారాయణ, జెడ్పీ సీఈఓ వి. జ్యోతిబసు, ఆర్డీఓ ఐ. కిషోర్, డీపీఓ నాగేశ్వరనాయక్, డీఆర్డీఏ పీడీ పీఎస్ఆర్ ప్రసాద్ పాల్గొన్నారు.

దివిసీమలో తొలిసారిగా మహాకుంభాభిషేక మహోత్సవం

12న ఉల్లిపాలెంలో లక్ష మందికి అన్నసమారాధన



మీడియాతో మాట్లాడుతున్న అష్టాక్షరీ స్వామీజీ

కోడూరు: దివిసీమ ప్రాంతంలో తొలిసారిగా 12 రోజుల పాటు మహా కుంభాభిషేక మహోత్సవాలను నిర్వహిస్తున్నామని అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్ కుమార రామానుజీయర్ స్వామీజీ అన్నారు. ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక ఉత్సవాల ఏర్పాట్లను అష్టాక్షరీ స్వామిజీ మంగళవారం పరిశీలించి మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏకైక శ్రీమన్నారాయణుడి ఆలయం ఉల్లిపాలెం గ్రామంలోనే ఉందని, ఈ ఆలయాన్ని కర్ణాటకలోని మేల్కోట తరహాలో నిర్మించారని చెప్పారు. ఆలయాన్ని పునర్నిర్మించి 12 సంవత్సరాలు కావడంతో ఈ నెల 6 నుంచి కుంభాభిషేక ఉత్సవాలు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నెల 12వ తేదీన స్వామివారి మూల మూర్తికి మహాకుంభాభిషేకం నిర్వహిస్తామని చెప్పారు. ఉదయం మహాపూర్ణాహుతి, ఆలయ ప్రాంగణంలో లక్ష మందికి అన్నసమారాధన జరుగుతుందని చెప్పారు.

ప్రత్యేక బస్సు సర్వీసులు

కుంభాభిషేక మహోత్సవానికి అవనిగడ్డ, మచిలీపట్నం డిపోల నుంచి ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నారని అష్టాక్షరీ స్వామీజీ తెలిపారు. 11వ తేదీన అర్ధరాత్రి నుంచి 12వ తేదీ సాయంత్రం వరకు బస్సు సర్వీసులు కొనసాగుతాయని చెప్పారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. సర్పంచి పావని, ఈఓ యలవర్తి సుబ్రహ్మణ్యం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్‌కార్డు ఇవ్వాలి

పెదకళ్లేపల్లి(మోపిదేవి): అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ జాబ్ కార్డు ఇవ్వాలని ఏపీడీ రమణారావు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులను ఆదేశించారు. పెదకళ్లేపల్లిలో మంగళవారం ఎఫ్ఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామంలో జాబ్‌కార్డులో డిలేట్ అయిన వారిని సంప్రదించి వారి అభిప్రాయాలు సేకరించారు. ఏపీఓ మజ్ను, టీఏ హరిబాబు నాయక్, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ దాడులు

రూ. 1.44 లక్షల జరిమానా

కోనేరు సెంటర్: మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ విజిలెన్స్ అధికారులు మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా విద్యుత్ వినియోగిస్తున్న 13 సర్వీసులకు సంబంధించి రూ. 1,44,000 జరిమానా విధించారు. రూరల్ సెక్షన్‌లో విద్యుత్ వినియోగదారుల గృహాలతో పాటు వాణిజ్య సముదాయాలపై దాడులు చేసిన అధికారులు కేసులను నమోదు చేశారు. విజిలెన్స్ ఈఈ కూన వెంకటేశ్వర్లు, మచిలీపట్నం ఈఈ ఎం. భాస్కరరావు ఆధ్వర్యంలో 38 బందాలుగా ఏర్పడి 34 గృహ సర్వీసులు, 32 వాణిజ్య సముదాయాలు, 501 ఆక్వా సర్వీసులతో పాటు ఇతర సర్వీసులు 232 కలిపి మొత్తం 799 సర్వీసులను తనిఖీ చేశారు. 13 సర్వీసులకు అదనపు లోడును వినియోగిస్తున్నట్లు గుర్తించి 1,44,000 జరిమానాగా విధించారు. మచిలీపట్నం డివిజన్‌లోని డీఈఈలు, ఏఈలు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హోమాలు

కోడూరు: ఉల్లిపాలెంలోని గోదా, రాజ్యలక్ష్మీ సమేత శ్రీమన్నారాయణ స్వామి వారి ఆలయంలో జరుగుతున్న కుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా హోమ క్రతువులను భక్తిప్రపత్తులతో నిర్వహిస్తున్నారు. మంగళవారం ఉదయం స్వామివారి ఉత్సవమూర్తులకు పల్లకీ సేవ జరిపారు. ప్రత్యేకంగా నిర్మించిన యాగశాలలో చతుస్థానార్చన, బలిప్రదానం, పూర్ణాహుతి, శయ్యాధివాస కార్యక్రమాలు నిర్వహించారు. ఎనిమిది హోమగుండాల ద్వారా రుత్వికులు ప్రత్యేక హోమాలు చేశారు. అనంతరం త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామీజీ పర్యవేక్షణలో స్వామివార్లకు ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

పది మందికి నూతన అడ్మిషన్లు

కోడూరు: ప్రభుత్వ పాఠశాలల్లో హాజరుశాతం పెంచేందుకు విద్యా శాఖ ఆధ్వర్యంలో మనబడి క్యాంపెయినింగ్ కార్యక్రమం మంగళవారం కృష్ణాపురం గ్రామంలో కొనసాగింది. ఎంఈఓ టీవీఎం రామదాసు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు యానాదిరావు, సాంబశివరావు, రాంబాబులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ బడుల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలను వివరించారు. ఇంగ్లిష్ మీడియం విద్య, జగనన్న గోరుముద్ద, అమ్మఒడి, జగనన్న విద్యాకానుక వంటి పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పది నూతన అడ్మిషన్లు ఇచ్చారు.